సాక్షి
పల్నాడు
బుధవారం ¦ 23 ¦ ఏప్రిల్ ¦ 2025



## లెనిన్‌కు ఘననివాళి

నరసరావుపేట ఈస్ట్: రష్యన్ సోషలిస్ట్ వ్యవస్థాపకుడు లెనిన్ జయంతిని మంగళవారం నరసరావుపేటలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. నాయకులు పాల్గొన్నారు.



## జిగురు అట్టల వాడకంపై అవగాహన

ముప్పాళ్ళ: నరసరావుపేట డాట్ ఆధ్వర్యంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు చాగంటివారిపాలెంలో రైతులకు జిగురు అట్టల వాడకంపై మంగళవారం అవగాహన కల్పించారు.



## వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం

దుగ్గిరాల: దుగ్గిరాల కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సివిల్స్‌లో మెరిసిన మనోళ్లు

వారంతా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారు.. తల్లిదండ్రులు తాము కష్టపడుతూ పిల్లలను ఎలాగైనా దేశ అత్యున్నత సర్వీసుల్లో చూడాలని కలలు కన్నారు. వారి కలలను సాకారం చేసేలా.. కృషి, పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని అభ్యర్థులు నిరూపించారు. ఎలాగైనా సివిల్ సర్వీసుల్లో చేరి దేశ సేవ చేయాలనే వారి సంకల్పం ముందు పేదరికం ఓడిపోయింది.. ఓటములు ఎదురైనా నిరాశపడకుండా, పట్టు విడవకుండా.. వాటినే విజయానికి మెట్లుగా మలచుకుని, విజేతలైన తీరు అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. మంగళవారం విడుదల చేసిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ – 2024 పరీక్ష ఫలితాల్లో పల్నాడు జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు మంచి ర్యాంకులు సాధించి, తమ తల్లిదండ్రుల కలలు నెరవేర్చి.. ప్రజా సేవలో అంకితం అయ్యేందుకు సిద్ధమయ్యారు.

## కష్టపడ్డారు.. కలలు నెరవేర్చుకున్నారు

### సివిల్స్‌లో 797వ ర్యాంకు సాధించిన సత్తెనపల్లికి చెందిన పెండెం ప్రత్యూష్

సత్తెనపల్లి: లక్ష్యం, కృషి, పట్టుదల, ప్రణాళిక ఉంటే అపురూప విజయం సాధ్యమవుతుందని పేద కుటుంబానికి చెందిన విద్యార్థి నిరూపించారు. అందుబాటులోని వనరులను వినియోగించుకొని సివిల్స్ విజేతగా నిలిచారు పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన పెండెం ప్రత్యూష్. సివిల్స్‌లో జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరిలో ప్రత్యూష్ 797వ ర్యాంకు సాధించారు. సాధారణ దళిత కుటుంబంలో జన్మించిన ప్రత్యూష్ బాల్యం నుంచి ఎంతో ఇష్టంతో చదివారు. ప్రస్తుతం సివిల్ సర్వీసెస్ విజేతగా నిలిచి ఐపీఎస్ అధికారిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సత్తెనపల్లి పట్టణంలోని 31వ వార్డు అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పెండెం బాబురావు, యనమాల పద్మ దంపతుల కుమారుడు ప్రత్యూష్. తండ్రి పెండెం బాబురావు న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. తల్లి యనమాల పద్మ గృహిణి. ప్రత్యూష్ రెండు పర్యాయాలు ప్రయత్నించి, మూడవసారి కసితో రిజర్వేషన్‌తో సంబంధం లేకుండా ఓపెన్ కేటగిరిలో జాతీయస్థాయిలో 797వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ప్రత్యూష్ సత్తెనపల్లిలోని హోలీ ఫ్యామిలీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో చదివి, టెన్త్‌లో 9.7 గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించాడు. ఇంటర్‌లో 970 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ విద్యనభ్యశించాడు. 2023–24 ఆంత్రోపాలజీ ఆప్షన్‌గా తీసుకొని ఓ పక్క వైద్యుడిగా వైద్య సేవలు అందిస్తూనే మరో పక్క సివిల్స్‌కు ప్రిపేర్ అవుతూ జాతీయస్థాయిలో ర్యాంక్ సాధించాడు.



తల్లిదండ్రులు పెండెం బాబురావు, పద్మలతో ప్రత్యూష్

#### చదువుకు పేదరికం అడ్డం కాదు

చదువుకు పేదరికం అడ్డం కాదు. విద్యార్థి దశ నుంచి ఉన్నత లక్ష్యం పెట్టుకోవాలి. ఎన్ని అవాంతరాలు వచ్చినా లక్ష్యసాధనపై దృష్టి పెట్టాలి. ఎటువంటి శిక్షణ తీసుకోకపోయినా పట్టుదలతో చదివితే ఖచ్చితంగా విజయం సాధించవచ్చు.

– పెండెం ప్రత్యూష్, సివిల్స్ ర్యాంకర్

## చదువుల లక్ష్మి

### సివిల్స్‌లో నరసరావుపేటకు చెందిన యామిని లక్ష్మీదేవికి 591వ ర్యాంక్



అంబటి యామిని లక్ష్మీదేవి

నరసరావుపేట ఈస్ట్: సివిల్ సర్వీస్ ఫలితాలలో నరసరావుపేట పట్టణానికి చెందిన అంబటి యామిని లక్ష్మీదేవి 591 ర్యాంక్ సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన యామిని తన చిన్నతనంలోనే తండ్రి సాంబశివారెడ్డిని కోల్పోయింది. తల్లి వెంకటరమణ తన రెక్కల కష్టంతో టైలరింగ్ వృత్తి నిర్వహిస్తూ తన ఇద్దరు ఆడపిల్లలను చదివిస్తోంది. యామిని స్వయంకృషితో సివిల్స్‌కు ఎంపిక కాగా, చెల్లెలు హారికారెడ్డి సీఏ చదువుతోంది. జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో ర్యాంక్ సాధించి మద్దిరాలలోని నవోదయ పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసిన యామిని ఇంటర్మీడియెట్‌ను హైదరాబాద్‌లో చదివింది. సీఈసీలో తెలంగాణ రాష్ట్రంలోనే ప్రథమస్థానం సాధించింది. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బీఏ జాగ్రఫీ ఆనర్స్ పూర్తిచేసి 2022 నుంచి సివిల్స్‌కు సిద్ధపడుతోంది. తన రెండవ ప్రయత్నంలోనే 591 ర్యాంక్ సాధించి ఐఆర్‌ఎస్ సర్వీస్‌కు ఎంపికకానుంది.

#### ప్రజా సేవకు అంకితం కావాలని...

ప్రజా సేవకు అంకితం కావాలనే లక్ష్యంతోనే సివిల్స్‌కు సిద్ధం అయ్యాను. రెండవ ప్రయత్నంలో సాధించిన 591 ర్యాంక్‌తో ఐఆర్‌ఎస్ సర్వీస్‌కు ఎంపిక అవుతాను. అయితే ఐఏఎస్ కావాలన్నది నా లక్ష్యం. నా ఉన్నతికి మా అమ్మమ్మ అచ్చమ్మ సపోర్ట్ ఎంతో ఉంది. అమ్మమ్మకు నా కృతజ్ఞతలు. సివిల్స్ ఉత్తీర్ణతకు కఠోర శ్రమ, సిలబస్ విశ్లేషణ ఎంతో అవసరం.

– అంబటి యామిని లక్ష్మీదేవి, సివిల్స్ ర్యాంకర్

## ప్రతిభ 'పవనాలు'

### సివిల్స్‌లో 146వ ర్యాంకు సాధించిన అచ్చంపేట మండల రుద్రవరంకు చెందిన పవన్ కల్యాణ్



తల్లిదండ్రులతో పవన్ కల్యాణ్

అచ్చంపేట: పల్నాడు జిల్లా, అచ్చంపేట మండలం, రుద్రవరం గ్రామానికి చెందిన చల్లా పవన్ కల్యాణ్ మంగళవారం వెలువడిన సివిల్స్ ఫలితాలలో ఆల్ ఇండియా స్థాయిలో 146వ ర్యాంకు సాధించాడు. మారుమూల గ్రామంలో పుట్టి ఇంతటి ఘనతను సాధించిన పవన్ కల్యాణ్‌ను మండల ప్రముఖులు అభినందనలతో ముంచెత్తారు. ప్రాథమిక సహకార సంఘ మాజీ అధ్యక్షుడు చల్లా రమేష్, భువనేశ్వరిల కుమారుడైన పవన్ కల్యాణ్ ఒక సామాన్య వ్యవసాయ కుటుంబంలో పుట్టి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అంచలంచెలుగా తన చదువుకు పదునుపెట్టాడు. విద్యార్థి దశనుంచే సివిల్స్ సాధనే లక్ష్యంగా పెట్టుకున్న పవన్ కల్యాణ్ ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యను గుంటూరులోని వెంకటేశ్వర బాలకుటీర్‌లో పూర్తిచేశాడు. పదిలో 10 జీపీఏతో ఉత్తీర్ణత సాధించాడు. గుంటూరు శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివిన పవన్ 987 మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. జేఈఈలో మంచి ర్యాంకు సాధించి ఎన్‌ఐటీ, తిరుచురాపల్లిలో సీటు సాధించాడు. బీటెక్ అయిపోగానే కొలిన్స్ ఎయిరో స్పేస్‌లో కాలేజ్ క్యాంపస్‌ప్లేస్‌మెంట్ సాధించాడు. అయితే సివిల్స్ మీదఉన్న మక్కువతో వచ్చిన అవకాశాన్ని వదులుకుని, ఢిల్లీ వెళ్లి స్వయం కృషితో పాతకాలం నాటి మెటీరియల్స్ సేకరించి తన మేధస్సుకు పదునుపెట్టి సివిల్స్‌లో ఆల్ ఇండియా 146వ ర్యాంక్ సాధించాడు.

## కమర్షియల్ ట్యాక్స్ ఏసీ నుంచి...



వావిలపల్లి భార్గవ

పిడుగురాళ్ల: సివిల్స్ ఫలితాల్లో పిడుగురాళ్ల వాణిజ్య పన్నుల శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న వావిలపల్లి భార్గవ ఆల్ ఇండియా స్థాయిలో 830 ర్యాంక్ సాధించారు. భార్గవ పిడుగురాళ్ల వాణిజ్య పన్నుల శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా 2025 ఫిబ్రవరిలో ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఉద్యోగం నిర్వహిస్తున్న క్రమంలోనే సివిల్స్ ఫలితాల్లో 830 ర్యాంక్ సాధించటం జరిగిందని భార్గవ తెలిపారు. విజయనగరం జిల్లాలోని రాజాం గ్రామానికి చెందిన వావిలపల్లి విష్ణు, ఈశ్వరమ్మ దంపతుల కుమారుడైన భార్గవ బీటెక్ పూర్తి చేశారు. 2010 నుంచి 2019 వరకు ఎస్‌బీఐలో ఉద్యోగం చేసిన భార్గవ ప్రస్తుతం పిడుగురాళ్లలో వాణిజ్య పన్నుల శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని భార్గవ తెలిపారు. నిరుద్యోగ యువత తమ లక్ష్యాల పట్ల దృష్టిసారిస్తే ఉన్నత శిఖరాలను ఆధిరోహిస్తారని ఆయన సూచించారు.

# పత్తి రైతుపై విత్తన భారం

- ప్యాకెట్‌కు రూ.37 పెరుగుదల
- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 1.22 లక్షల హెక్టార్లలో పత్తిసాగు
- సుమారు 11 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం
- గుంటూరు, పల్నాడు జిల్లాల రైతులపై రూ.4.07 కోట్ల భారం

**ఏటా పెరుగుతున్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలతో అన్నదాతలపై పెట్టుబడుల భారం అధికంగా పడుతోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు సరైన ధరలు లేక వారు నష్టపోతున్నారు. పత్తి సాగుకు అవసరమయ్యే విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేయడం లేదు. రైతులు ప్రైవేటు డీలర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. రెండేళ్లుగా కొద్దిగా ధర పెంచిన విత్తన కంపెనీలు ఈ ఏడాది మాత్రం బీజీ–2 విత్తన ప్యాకెట్‌పై ఏకంగా రూ.37 పెంచాయి.**

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రైతులు ఖరీఫ్ సీజన్‌లో సుమారు 1.22 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేస్తారు. ఇందులో గుంటూరు జిల్లాలో 25 వేల హెక్టార్లు, పల్నాడు జిల్లాలో 97 వేల హెక్టార్లు ఉన్నాయి. ఈ రెండు జిల్లాల్లో ఇది ప్రధాన పంటల్లో ఒకటి. గుంటూరు, పల్నాడు జిల్లాలకు సుమారు 11 లక్షల విత్తన ప్యాకెట్లు డిమాండ్ ఉంటుందని వ్యవసాయశాఖ అధికారుల అంచనా. 475 గ్రాముల విత్తన ప్యాకెట్ ధర గతంలో రూ.864 ఉండగా, ప్రస్తుతం రూ.901లకు చేరింది. అంటే ప్యాకెట్‌కు రూ.37 పెరిగింది. దీంతో గుంటూరు, పల్నాడు జిల్లాల రైతులపై అదనంగా రూ.4.07 కోట్ల భారం పడనుంది. గత ఏడాది సాగు సమయంలో సరిగా వర్షాలు లేక, తర్వాత అధిక వర్షాలతో దిగుబడులపై తీవ్ర ప్రభావం పడింది. ఆ బాధ నుంచి కోలుకోకుండానే ఈ ఏడాది పెట్టుబడి ఖర్చులు పెరగడం ఇబ్బంది కలిగిస్తోంది.



పత్తి విత్తన ప్యాకెట్లు

### ధరలు పెంచడం బాధాకరం



అసలే వ్యవసాయం గిట్టుబాటు కాక నానా ఇబ్బందులు పడుతున్న రైతులపై పత్తి విత్తన ప్యాకెట్ల ధర పెంచడం పుండు మీద కారం చల్లినట్లే. నేను ప్రతి సంవత్సరం 10 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తుంటాను. సుమారు 30 ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరం. అంటే విత్తనాల కోసం అదనంగా రూ.వెయ్యికిపైగానే వెచ్చించాల్సి వస్తోంది. విధిలేని పరిస్థితుల్లో పత్తి పంట సాగు చేస్తున్నాం. ఏటా నష్టాలు చవిచూస్తున్నాం. ఇప్పటికైనా పత్తి విత్తన ధరలను తగ్గించాలి. – వంగా నవీన్‌రెడ్డి, జొన్నలగడ్డ, గుంటూరు రూరల్ మండలం

## సివిల్స్‌లో విజయ్‌బాబుకు 681వ ర్యాంక్

### ప్రస్తుతం ఐఆర్‌ఎస్ అధికారిగా చేస్తున్న విజయ్‌బాబు



తెనాలి: సివిల్స్‌లో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన దోనేపూడి విజయ్‌బాబు మరోసారి విజయం సాధించారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఆయనకు 681వ ర్యాంకు లభించింది. ఐఆర్‌ఎస్ అధికారి దోనేపూడి మధుబాబు, రాజ్యలక్ష్మిల కుమారుడు విజయ్‌బాబు. 2021లోనే సివిల్స్ రాసి అప్పట్లో 682 ర్యాంకు సాధించారు. 22 ఏళ్ల వయసులోనే ఐఆర్‌ఎస్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం విజయవాడలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఐఏఎస్/ఐపీఎస్ సాధించాలన్న పట్టుదలతో ఉద్యోగ బాధ్యతల్లో కొనసాగుతూ సివిల్స్ రాశారు. ప్రస్తుతం 681 ర్యాంకుతో మళ్లీ మెరిశారు.

## ఉన్నవ ఉప సర్పంచిపై టీడీపీ శ్రేణుల దాడి

అమరావతి: పల్నాడు జిల్లా అమరావతి పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలలో సోమవారం రాత్రి యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామ ఉపసర్పంచ్ చాగంటి శ్రీధర్‌పై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డాయి. వివరాలల్లోకి వెళితే మండెపూడి గ్రామానికి చెందిన సామినేని ధనుంజయరావు గత కొంతకాలంగా యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామంలో కాపురముంటున్నాడు. ఈక్రమంలో అమరావతి పోలీసులు కేసు విచారణ నిమిత్తం ధనుంజయరావును ఉన్నవ గ్రామం నుంచి అమరావతి తీసుకువచ్చారు. ఈక్రమంలో తమ గ్రామంలో నివాసముంటున్న ధనుంజయరావును అమరావతి పోలీసులు తీసుకువెళ్లటంతో అమరావతి పోలీస్ స్టేషన్‌కు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు ఉపసర్పంచ్ చాగంటి శ్రీధర్ మరికొంతమందితో కలిసి అమరావతికి పోలీసులతో మాట్లాడటానికి రావటం జరిగింది. ఈనేపథ్యంలో చాగంటి శ్రీధర్‌కు వ్యతిరేకులైన యడ్లపాడు మండలానికి చెందిన కొందరు టీడీపీ నేతలు అమరావతిలో టీడీపీ వారిని దాడికి ఉసిగొల్పినట్లు సమాచారం. పోలీస్‌స్టేషన్ పరిసరాలలో జరిగిన ఈదాడిలో ఉన్నవ ఉప సర్పంచ్ శ్రీధర్ కాలికి తీవ్రగాయాలయ్యాయి. అలాగే అయన కారు అద్దాలు పగిలి పోయాయి. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదులు లేవని కేసు నమోదు కాలేదని సీఐ అచ్చియ్య తెలిపారు.

**పథకం ప్రకారమే దాడి చేశారు..**

యడ్లపాడు: పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామ ఉప సర్పంచ్ చాగంటి శ్రీధర్‌పై జరిగిన దాడిని మాజీ మంత్రి విడదల రజిని తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆమె వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఉన్నవ గ్రామాన్ని సందర్శించి, గాయపడ్డ శ్రీధర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సోమవారం రాత్రి అధికార టీడీపీకి చెందిన కొందరు, పథకం ప్రకారం దాడి చేసి శ్రీధర్‌ను గాయపర్చారని ఆరోపించారు. టీడీపీ నేతలు పథకం ప్రకారమే అమరావతి పోలీస్‌స్టేషన్‌కు వచ్చేలా చేశారన్నారు. ఉన్నవ గ్రామంలో ఉంటున్న మండెపూడి వాసి సామినేని ధనుంజయరావును తీసుకురావాలని అక్కడి పోలీసులచే కబురు పంపించి, స్టేషన్‌కు రప్పించినట్లు తెలిపారు. స్టేషన్ ఎదుటే 25 మంది దుండగులు ముట్టడి చేసి, శ్రీధర్‌ను గుర్తించి దాడి చేయడమేగాక, అతని కారు అద్దాలను ధ్వంసం చేశారని వివరించారు. దాడిలో గాయపడిన శ్రీధర్ చిలకలూరిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు చెప్పారు. కేవలం స్థానికంగా జరిగే అక్రమాలపై ఎవరూ ప్రశ్నించకుండా ఉండేందుకు ఇలా తమ పార్టీ వారిపై దాడులకు దిగుతున్నట్లు చెప్పారు. ఈ ఘటనపై పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి, అలాగే పల్నాడు ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం కోసం పోరాడతామని ప్రకటించారు. ఆమె వెంట పార్టీ మండల అధ్యక్షుడు గంట శంకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ దరియావలి, పార్టీ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారాజు, ఇతర నాయకులు జాజుల శ్రీకాంత్, బింజు సాంబశివరావు, గంటా కిషోర్, వంకధారి పుల్లయ్య, గుత్తావారిపాలెం నాని తదితరులు ఉన్నారు.

# నిండా మునిగి.. గుండె పగిలి..

**కొద్ది రోజులుగా మనుషులతో మాట్లాడుతున్నాడేగానీ గుండె నిండా దిగులు పొరలే... చెమట చుక్కలు చిందించిన తన కష్టమే కాదు.. కన్న కొడుకు సంపాదన కూడా చిక్కుల్లో పడిందనే ఆలోచనలు కన్నీటి సుడిగుండాలై చుట్టుముట్టాయి. అనుకోనిది ఏదైనా జరిగితే, తన నమ్మకం మోసానికి బలైతే ఎవరికి ఏం సమాధానం చెప్పాలో తెలియక దిగులు కన్నీళ్లతో నిండిన గుండె ఉక్కిరిబిక్కిరైంది. అంతులేని ఆలోచనలతో, ఎవరికీ చెప్పుకోలేని ఆవేదనతో నరసరావుపేటలో యానిమేషన్ మోసానికి మంగళవారం ఓ నిండు ప్రాణం బలైంది. కుటుంబ సభ్యులకు అంతులేని వేదన మిగిల్చింది.**

### 'యానిమేషన్' మోసానికి వ్యక్తి బలి

- సంస్థలో రూ.10 కోట్లు పెట్టుబడి పెట్టిన నరసరావుపేట వాసి నాగేశ్వరరావు
- మోసపోయానని తెలిసి గుండెపోటుతో మృతి
- ఆందోళన చెందుతున్న బాధితులు
- ఆర్థిక నేరాలపై కన్నెత్తి చూడని ప్రభుత్వం

నరసరావుపేటటౌన్: నరసరావుపేటలోని బరంపేటకు చెందిన గుండా నాగేశ్వరరావు (48) ప్రముఖ వ్యాపారవేత్త. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరిద్దరూ విదేశాల్లో స్థిరపడ్డారు. విజయవాడ కేంద్రంగా కిరణ్ అనే వ్యక్తి ప్రారంభించిన యానిమేషన్ సంస్థలో గుండా నాగేశ్వరరావు రెండేళ్లుగా పెట్టుబడులు పెడుతున్నారు. తొలుత లాభాలు రావడంతో ఏడాదిగా కుమారుడు విదేశాల నుంచి పంపుతున్న నగదుతోపాటు అప్పులు చేసి మరీ యానిమేషన్ సంస్థలో సుమారు రూ.10 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టేశాడు. అయితే కొద్ది నెలలుగా ఈ సంస్థ బోర్డు తిప్పేయడంతో ఏమి చేయాలో అర్థంగాక, విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పే ధైర్యం లేక తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యాడు. నాలుగు రోజులుగా మరింత దిగులుగా ఉన్న నాగేశ్వరరావు మంగళవారం మధ్యాహ్నం గుండె పోటు రావడంతో ఒక్కసారి కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించేసరికి ప్రాణాలు కోల్పోయాడు.



గుండా నాగేశ్వరరావు (ఫైల్)

**మానసిక వేదనలో బాధితులు**

యానిమేషన్ సంస్థలో పెట్టిన రూ.కోట్లు పోయాయని తెలుసుకున్న బాధితులు మనోవేదనకు గురవుతున్నారు. తిండి సహించక..సరిగ్గా నిద్ర పట్టక సతమతవవుతున్నారు. కోటి పెట్టుబడి పెడితే 70 శాతం వడ్డీతో రూ.1.70 కోట్లు వస్తాయన్న అత్యాశకు పోయి ఉన్న సొమ్ముతో పాటు బయట వడ్డీలకు తీసుకొచ్చి మరీ పెట్టుబడిలో పెట్టారు. అవి తిరిగి రావన్నా విషయం తెలుసుకొని లోలోపల కుమిలి పోతున్నారు. భారీ మొత్తంలో సొమ్ములు పోగొట్టుకోవటంతో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. అప్పులు ఇచ్చినవారికి అవి ఎలా చెల్లించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. కొందరు ఉన్న ఆస్తులు అమ్మి అప్పులోళ్లకు చెల్లిస్తుండగా, మరి కొందరు డబ్బులు చెల్లించే పరిస్థితి లేక ఐపీ పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ ఒత్తిడి భరించలేకే నాగేశ్వరరావు మృతి చెందాడని అతని స్నేహితులు చెప్పుకొస్తున్నారు.

### ప్రభుత్వానికి పట్టని బాధితుల గోడు

నరసరావుపేట కేంద్రంగా సాయిసాధన చిట్‌ఫండ్ అధినేత పుల్లారావు ప్రజల నుంచి సుమారు రూ.400 కోట్లు వసూలు చేసి కుచ్చుటోపీ పెట్టారు. దీనిపై బాధితులు రోడ్డెక్కి ధర్నాలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు వినతిపత్రాలు సమర్పించారు. చివరకు సీఎం చంద్రబాబు నాయుడు వద్దకు కూడా వెళ్లి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అయితే మేమున్నామని ధైర్యం చెప్పి పంపించిన వారు అనంతరం గాలికొదిలేశారు. దీంతో బాధితులు తాము ఎవరికి చెబితే న్యాయం జరుగుతుందో అర్థంగాక తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. తాజాగా యానిమేషన్ సంస్థ కూడా సుమారు రూ.400 కోట్లకు బోర్డు తిప్పేసిందని తెలిసి, బాధితులు లబోదిబోమంటున్నారు. తాజాగా నాగేశ్వరరావు మానసిక ఒత్తిడి తట్టుకోలేక గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలిసినప్పటి నుంచి బాధితులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. ఆర్థిక నేరాలకు ప్రాణాలు పోతున్నా ప్రజల గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకెన్ని ప్రాణాలు పోతే తమకు న్యాయం చేస్తారని ప్రశ్నిస్తున్నారు.

## న్యూస్‌రీల్

### 25న 'ఏపీ గురుకులాల' ప్రవేశ పరీక్ష

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 25వ తేదీన ఏపీ ఆర్‌జేసీ, ఏపీఆర్‌డీసీ సెట్–2025 ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు సెట్ పల్నాడు జిల్లా కో–ఆర్డినేటర్ ఎన్.సరోజిని మంగళవారం తెలిపారు. ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5 నుంచి 8వ తరగతి వరకు ప్రవేశాలకు 944మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్టు తెలిపారు. వీరికి శంకరభారతీపురం జడ్పీ హైస్కూల్, హిందూ స్కూల్, సెయింట్ మేరీస్ హైస్కూల్, మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. పరీక్ష 25వ తేదీ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. అలాగే ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్‌డీసీ ప్రవేశ పరీక్షకు 7 పరీక్షా కేంద్రాలలో 1,706మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. వీరికి శంకరభారతీపురం జడ్పీ హైస్కూల్, హిందూ స్కూల్, సెయింట్ మేరీస్ హైస్కూల్, మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల, మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్, శ్రీకృష్ణ చైతన్య హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరై ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

### ప్రధాని పర్యటన ఏర్పాట్లు పరిశీలన



వెలగపూడి(తాడికొండ): తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామంలోని సచివాలయం సమీపంలో మే 2వ తేదీన జరగనున్న అమరావతి తదితర శంకుస్థాపన కార్యక్రమాల్లో ప్రధాని మోదీ పాల్గొననున్న నేపథ్యంలో ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజలతో కలిసి మంగళవారం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పరిశీలించారు. హెలీప్యాడ్ నిర్మాణం, ప్రధాని రోడ్ షో సాగే మార్గాలు, ప్రధాన వేదిక, పబ్లిక్, వీవీఐపీ, గ్యాలరీల వద్ద ఏర్పాట్లను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏర్పాట్లు నిర్దేశిత సమయం కంటే ముందే వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ ఎం.నవీన్ కుమార్, అడిషనల్ ఎస్పీ సుప్రజ, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాస మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### పోలేరమ్మ వారి వార్షికోత్సవాలు



తెనాలి: స్థానిక వైకుంఠపురం దేవస్థానం సమీపంలోని శ్రీ పోలేరమ్మ వారి ఆలయం 27వ వార్షికోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఉదయం విశేష పూజలు చేశారు. రాత్రి ఏడు గంటలకు అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. పసుపు, కుంకుమ, విశేష అలంకరణతో మేళతాళాలు, కాళికా వేషం, భాజా భజంత్రీలతో తెనాలి పురవీధుల్లో ఊరేగింపు జరిగింది. ఆలయ ధర్మకర్త వీరయ్య, గుంటి వెంకట్ ఆధ్వర్యంలో వేడుకలను జరిపారు. బుధవారం ఉదయం అన్నప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

### ఉద్యోగుల సమస్యలపై చర్చకు వినతి



గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్‌బాషా మంగళవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కోరారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లో అసోసియేషన్ నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చాంద్‌బాషా మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులతోపాటు పెన్షనర్ల సమస్యలు అనేకం ఉన్నాయన్నారు. జేఎస్‌సీ సమావేశం ఏర్పాటుతో అనేక అంశాలు చర్చించే వీలు కలుగుతుందని పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### ఇంద్ర ఏసీ బస్సు మాచర్ల నుంచి బుకింగ్

**వినుకొండ:** ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ వెళ్లే ఇంద్ర ఏసీ బస్సు సర్వీస్‌కు మాచర్ల నుంచి టికెట్లు బుక్ చేసుకొనేందుకు ఆర్టీసీ అవకాశం కల్పించడం జరిగిందని వినుకొండ డిపో మేనేజర్ నాగేశ్వరరావు మంగళవారం తెలియజేశారు. ఈ అవకాశాన్ని మాచర్ల నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు సద్వినియోగం చేసుకోగలరని సూచించారు.

### కస్తూర్బా పాఠశాలను సందర్శించిన డీఈఓ



**క్రోసూరు:** జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ 20 మంది జిల్లా ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లెర్నింగ్ న్యూమరసీ) టీంతో కలసి క్రోసూరు కస్తూర్బా బాలిక విద్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఎఫ్ఎల్ఎన్ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, గణిత సామర్థ్యాలను పరిశీలించారు. ఇంటర్ ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన బాలికలను అభినందించి బహుమతులు అందచేశారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాం చాలా ఉపయుక్తమైందన్నారు. సర్వ శిక్ష అభియాన్ ఏపీసీ సుబ్బారావు, జీసీడీఓ డి.రేవతి, క్రోసూరు ఎంఈఓ ఏకుల ప్రసాద్ రావు, కేజీబీవీ ఎస్ఓ సీహెచ్ ఇందిరా ప్రియదర్శిని, డీఆర్పీలు పాల్గొన్నారు.





# ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు చేరువకండి

- జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు
- పలు పోలీస్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు

**నరసరావుపేటటౌన్:** ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత చేరువ కావాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పోలీసు సిబ్బందికి సూచించారు. మంగళవారం వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్‌లలో ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాపర్టీ నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. దీర్ఘకాలిక పెడింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. విచారణలో ఉన్న కేసుల పురోగతి, దర్యాప్తు అం



వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

శాలను పరిశీలించారు. విచారణ దశలో ఉన్న ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులకు సంబంధించి పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరక్కుండా సమస్యాత్మక ప్రదేశాలను గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ పోలీస్ సిబ్బంది సహకారంతో మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టంపై దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాలు, లోన్‌యాప్ మోసాలపై ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలు మోసగాళ్ల బారిన పడకుండా కాపాడాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కె.నాగేశ్వరరావు, సీఐలు ఎం.వి.చరణ్, హైమారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి

నరసరావుపేటలో సీహెచ్‌ఓల ధర్నా

**నరసరావుపేట:** జిల్లాలో ఆయుష్మాన్‌భవ, రాష్ట్ర వైద్యఆరోగ కుటుంబ సంక్షేమశాఖల కింద పనిచేస్తున్న తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్ఓ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తమ డిమాండ్ల సాధనకోసం పట్టణంలోని స్టేషన్‌రోడ్డులో గల గాంధీ పార్కు ఎదుట ఏపీ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీ ఎంసీఏ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎం.అనుపమ, ఉపాధ్యక్షుడు కె.వినోద్, జిల్లా కో–ఆర్డినేటర్ బి.సాగర్, ప్రధాన కార్యదర్శి రాము మాట్లాడుతూ జిల్లాలో తాము 361మంది పనిచేస్తున్నామన్నారు. తామందరమూ ఆరేళ్ల నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగులుగా చేస్తున్నామని, నిబంధనల ప్రకారం తమను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సిఫార్సుకూడా చేసిందన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలను దృష్టిలో పెట్టుకొని



స్టేషన్ రోడ్డులోని గాంధీపార్కు ఎదురుగా ధర్నా చేస్తున్న సీహెచ్‌ఓలు

తమతో పాటు పనిచేసే ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ చేయాలని కోరారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఈపీఎఫ్ఓ పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దెబకాయిలను వెంటనే చెల్లించి క్రమబద్ధీకరించాలని, నిర్దిష్టమైన జాబ్‌చార్టు అందజేయాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్‌ఓలకు మినహాయింపు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్లు, ట్రాన్స్‌ఫర్స్, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవులు అమలుచేయాలని డిమాండ్ చేశారు. జాయింట్ సెక్రటరీ శివానాయక్, కె.శివ, కోటి, పెద్దసంఖ్యలో సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

## ముగిసిన 'అటల్ టింకరింగ్ ల్యాబ్' బూట్ క్యాంప్



**పెదకూరపాడు:** పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం 75త్యాళ్ళూరు జిల్లా పరిషత్ హైస్కూల్లోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో రెండు రోజుల నుంచి జరుగుతున్న బూట్ క్యాంప్ మంగళవారం సాయంత్రం ముగిసింది. ఎలక్ట్రికల్ సర్క్యూట్స్, హై సెక్యూరిటీ డోర్ లాకింగ్ సిస్టం, డిజైనింగ్ ఆఫ్ ఇన్నోవేటివ్ కార్డ్స్, ఈ–వేస్ట్ కలెక్షన్ వంటి అంశాలపై విద్యార్థులు సృజనాత్మకతతో ప్రాజెక్టులను తయారు చేశారు. రాబోయే రోజుల్లో టెక్నాలజీ కీలక భూమిక పోషించబోతుందని, ఇన్నోవేటివ్ స్పిరిట్ తో విద్యార్థులు ముందడుగు వేయాలని అటల్ టింకరింగ్ ల్యాబ్ స్టేట్ ఆఫీసర్ మరియు యునిసెఫ్ కన్సల్టెంట్ సుదర్శన్ అన్నారు. స్టేట్ హబ్ మెంటార్ వెంకటేష్ మాట్లాడారు. క్యాంపులో బృగుబండ, ఆర్.కె.పురం పిన్నెల్లి, అమరావతి, 75 త్యాళ్లూరు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. క్యాంప్ ముగిసిన అనంతరం విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. హెచ్‌ఎం ఎ.శ్రీనివాస రెడ్డి, అటల్ ల్యాబ్ ఇన్‌చార్జ్ కె.వి.సుబ్బారావు, మెంటర్స్ వేణు, సుజిత, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తుమ్మకోట అర్చక ఇనాము భూములకు విముక్తి

ఏపీ అర్చక సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట రామలింగేశ్వర శాస్త్రి

**తుమ్మకోట(రెంటచింతల):** మండలంలోని తుమ్మకోట గ్రామంలోని ఆలయాలకు చెందిన 56 ఎకరాల అర్చక ఇనాములకు రైతుకూలీ సంఘం వారి నుంచి విముక్తి లభించినట్లు ఏపీ అర్చక సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి అన్నారు. మంగళవారం తుమ్మకోట గ్రామంలో ఆయా ఆలయాలకు చెందిన భూములకు చెందిన పత్రాలను అర్చకులకు అందచేసి మాట్లాడారు. శ్రీ సీతారామ స్వామి ఆలయం, శ్రీ జనార్దన స్వామి ఆలయం, శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయాలకు చెందిన అర్చకమాన్యం భూములను గత మూడు సంవత్సరాల నుంచి రైతు కూలీ సంఘం వారు సాగుచేసుకుంటూ ఎలాంటి కౌలు చెల్లించలేదన్నారు. దీంతో మండల ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డితో కలిసి వారి



భూములకు సంబంధించిన పత్రాలను ఆలయ అర్చకుడికి అందజేస్తున్న దృశ్యం

నుంచి ఆ భూములను స్వాధీనం చేసుకుని రైతులకు కౌలుకు ఇచ్చినట్లు తెలిపారు. ఈ భూములకు మొదటి సంవత్సరం రూ.5 వేలు, రెండవ సంవత్సరం రూ. 5,500, మూడవ సంవత్సరం రూ. 6 వేలుగా నిర్ణయించి ఈ కౌలును వారు ప్రతి ఏటా మే నెలాఖరులోపు చెల్లించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అర్చక సంఘం నాయకులు గొట్టిపాళ్ల కృష్ణమాచార్యలు, అర్చకులు చిట్టేల మల్లిఖార్జున శర్మ, రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు



**అమరావతి:** మండలంలోని ఎనికపాడు గ్రామంలో నూతనంగా నిర్మితమైన దేవాలయంలో హనుమత్, లక్ష్మణ సీతాసమేత రామచంద్ర స్వామి వారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు గత మూడు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం చతుస్థానార్చనలు, శాంతిహోమాలు జరిపించారు. పవిత్ర కృష్ణానది జలాల్లో హనుమత్, లక్ష్మణ సీతాసమేత రామచంద్ర స్వామి వారి నూతన విగ్రహాలను, జీవధ్వజాన్ని జలాధివాసం చేసిన అనంతరం అమరావతి పురవీధులలో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. పలువురు భక్తుల వార్లు పోసి పూజలు నిర్వహించారు.

## 25న జాబ్‌మేళా

**గుంటూరు ఎడ్యుకేషన్:** గుజ్జనగుండ్లలోని గుంటూరు జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి డి.దుర్గాబాయి ఓ ప్రకటనలో తెలిపారు. వరుణ్ మోటార్స్, ఫ్లిప్‌కార్ట్, పేటీఎం, ఎస్‌బీఐ లైఫ్, ఫెయిర్‌డీల్ క్యాపిటల్, క్యాప్‌స్టన్ సర్వీసెస్ సంస్థల్లో ఉద్యోగాల భర్తీకై టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, పీజీ విద్యార్హతలతో 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల వారు అర్హులన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో రావాలని, వివరాలకు 98668 22697 నంబర్లో సంప్రదించాలన్నారు.

## గుంటూరు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిగా పద్మ

**గుంటూరు ఎడ్యుకేషన్:** గుంటూరు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ)గా జగన్నాథం పద్మ నియమితులయ్యారు. అచ్చంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న పద్మ రెండేళ్లుగా డీఐఈఓగా ఎఫ్ఏసీ బాధ్యతలపై పనిచేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్‌కు సోమవారం పదోన్నతి కల్పిస్తూ విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ ఇచ్చిన ఉత్తర్వుల్లో భాగంగా ఆమె సైతం పదోన్నతి పొందారు. గుంటూరు డీఐఈఓగా రెగ్యులర్ పోస్టింగ్‌తోపాటు, గుంటూరు జోన్ ఆర్జేడీగా ఎఫ్ఏసీ బాధ్యతలను ఆమెకు అప్పగించారు.

## స్టైల్‌గా వచ్చాడు... చక్కగా దోచేశాడు!

- వినూత్నంగా దొంగతనం
- పెళ్లిలో చదివింపులు మాయం

**మంగళగిరి టౌన్:** ఓ వివాహానికి స్టైల్‌గా హాజరై... బంధువుగా మమేకమయ్యాడు. అందరితో చనువుగా ఉంటూ, భోజనం చేసి సుమారు 4 గంటలకు పైగా వారితో తిరిగాడు. చక్కగా చదివింపులు దోచుకుపోయాడు ఓ దొంగ. ఈ ఘటన మంగళగిరి పట్టణంలో ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరి పట్టణం శివాలయం రోడ్డులో నివాసముంటున్న జి. చిన్ని తన కుమారుడు జి. సాంబశివరావు వివాహ వేడుకను ఆదివారం పట్టణ పరిధిలోని మార్కండేయ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఓ గుర్తుతెలియని వ్యక్తి స్టైల్‌గా హాజరై అందరితోపాటు కూర్చున్నాడు. కొంతసేపు అక్కడివారితో మాట్లాడి చదివింపులు దగ్గరకు వెళ్లాడు. పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నట్లు నటిస్తూ అటూ ఇటు తిరుగుతూ హడావిడి చేశాడు. పెళ్లి వారితో కలిసి విందు భోజనం కూడా ఆరగించాడు. చదివింపుల దగ్గర ఓ పాప ఉండడం గమనించి ఈ డబ్బులు లోపల పెట్టు అంటూ గదమాయించాడు. దీంతో ఆ పాప పక్కన ఉన్న రూమ్‌లోకి వెళ్లి అక్కడ పెట్టి వచ్చేసింది. వెంటనే ఆ వ్యక్తి ఆ రూమ్‌లోకి వెళ్లి తలుపు దగ్గరకు వేసి ఆ డబ్బు తీసుకుని బయటకు వచ్చాడు. పాపను చదివింపుల డబ్బు ఎక్కడ అని అడగ్గా, ఓ అంకుల్ లోపల పెట్టమన్నాడని చెప్పడంతో లోపలికి వెళ్లి చూశారు. అక్కడ డబ్బు లేకపోవడంతో కంగుతిన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చదివింపుల నగదుతోపాటు బంధువులు, మిత్రులు కొంతమంది బంగారపు చైన్లు, ఉంగరాలు బహుమతులుగా ఇచ్చారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. నగదు సుమారు రూ.3 లక్షలకుపైగా ఉంటుందని కుటుంబ సభ్యులు అంటున్నారు. మంగళగిరి పట్టణ పోలీసులు కల్యాణ మండపంలో సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించి ఆ వ్యక్తి కదలికలకు గుర్తించారు. వివరాలు కనుగొనేందుకు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

## 26 నుంచి ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతులు



**లక్ష్మీపురం:** ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు ఏప్రిల్ 26, 27, 28వ తేదీలలో కడప నగరంలో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి కరపత్రాలు విడుదల చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బందెల నాసర్‌జీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలపై తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి విద్యార్థికి రూ. 15వేలు ఇస్తామని హామీ ఇచ్చినా ఈ సంవత్సరం అమలు చేయలేమని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రణీత్, వెంకట్, అజయ్, అమీర్, సాయి గణేష్, చందు, కిషోర్, ఏలియా, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

**చేబ్రోలు:** ప్రమాదవశాత్తూ రెండు వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఆటో డ్రైవర్ అక్కడక్కడే మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాపట్లకు చెందిన గోదాటి కిరణ్ (35) ఆటోలో గుంటూరులో ముగ్గురు ప్రయాణికులను ఎక్కించుకొని బాపట్లకు బయలుదేరాడు. మార్గ మధ్యలో చేబ్రోలు సినిమా హాలు దాటిన తరువాత వంతెన సమీపంలో ఎదురుగా వస్తున్న టాటా ఇంద్ర వాహనం ఢీ కొట్టింది. ఆటో నడుపుతున్న కిరణ్ తలకు బలమైన గాయ వటంతో ఆటోలోనే అక్కడక్కడే మరణించాడు. ఆటోలో ఉన్న మిగిలిన ముగ్గురికి ఎటువంటి గాయాలు కాలేదు. చేబ్రోలు పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కిరణ్ బాపట్ల పట్టణంలోని బేతానీ కాలనీ వాసిగా గుర్తించారు.

## పసుపు ధరలు

**దుగ్గిరాల:** దుగ్గిరాల పసుపు యార్డులో 1,818 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 1281 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.11,050, గరిష్ట ధర రూ.12,150, మోడల్ ధర రూ.11,780. కాయలు 537, బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.11,050, గరిష్ట ధర రూ.12,150, మోడల్ ధర రూ.11,780, మొత్తం 1363.500 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు ఆయన తెలిపారు.



## ప్రాథమిక విద్య మా గ్రామంలోనే కొనసాగించాలి

నిరసన వ్యక్తం చేసిన ఓర్వకల్లు గ్రామస్తులు

**అచ్చంపేట:** ఒకటి నుంచి ఐదో తరగతి వరకు తమ గ్రామంలోనే నిర్వహించాలని, పాఠశాలను పక్క గ్రామాలకు తరలిస్తే తమ పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని మండలంలోని ఓర్వకల్లు గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. తమ పిల్లలతో కలిసి రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. తమ గ్రామానికి చెందిన పిల్లలు తమ గ్రామంలోనే చదువుకోవాలంటూ నినాదాలు చేశారు. ఓర్వకల్లు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతులు వరకు ఉండేవి. అయితే ఈ విద్యా సంవత్సరం నుంచి 1,2 తరగతులను మాత్రమే ఇక్కడ ఉంచి 3,4,5 తరగతుల వారిని పక్క గ్రామమైన రుద్రవరానికి మార్చారు. దీంతో ప్రాథమిక విద్య మొత్తం తమ గ్రామంలోనే నిర్వహించాలంటూ గ్రామస్తులు



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు

నినాదాలు చేశారు. ధర్నా చేపట్టారు. వెంటనే జిల్లా కలెక్టర్, డీఈఓ, ప్రజాప్రతినిధులు జోక్యంచేసుకుని తమకు న్యాయం చేయాలంటూ మొర పెట్టుకున్నారు. ఇంతలో పోలీసులు రంగ ప్రవేశం చేసి రోడ్డుపై బైఠాయించిన వారికి నచ్చచెప్పి ధర్నాను విరమింపచేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడి అరెస్ట్

**నరసరావుపేటటౌన్:** హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ హైమారావు తెలిపారు. మంగళవారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. బరంపేటకు చెందిన నాగమ్మకు, అమె అల్లుడు ఆకుల కిషోర్‌కు మధ్య ఆస్తి వివాదం ఉంది. గుంటూరులో నివాసం ఉండే కిషోర్ మద్యం సేవించి తరుచూ వచ్చిపోతూ ఆస్తి పంచటంలేదంటూ ఆమెతో గొడవ పడుతూ ఉండేవాడు. నాగమ్మ గృహంలో అద్దెకు ఉండే గోపిదేశి వెంకటేష్(30) చూసి అనేకమార్లు కిషోర్‌తో గొడవ వద్దని వారించాడు. తన అత్తకు సపోర్ట్‌గా వెంకటేష్ వస్తున్నాడని కక్ష పెంచుకున్న ఆకుల కిషోర్ ఈ నెల 18వ తేదీన ఇంట్లో ఉన్న వెంకటేష్‌పై కర్రతో దాడికి పాల్పడ్డాడు. సంఘటనలో తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వ వైద్యశాల్లో చికిత్స పొందుతూ 20వ తేదీ వెంకటేష్ మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన



వివరాలు వెల్లడిస్తున్న సీఐ హైమారావు, పక్కన ఎస్ఐలు అశోక్, లేఖా ప్రియాంక

ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడు ఆకుల కిషోర్‌పై ఇప్పటికే గుంటూరులో ఎనిమిది దొంగతనం కేసులు ఉన్నాయన్నారు. కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ కూడా ఉందని తెలిపారు. సమావేశంలో ఎస్ఐ అశోక్, ఎస్ఐ లేఖ ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రోన్ సాంకేతికతతో అధిక దిగుబడులు

- జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ
- డ్రోన్‌లు పొందే విధానంపై కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు

**నరసరావుపేట:** రైతులు డ్రోన్ సాంకేతికతను వినియోగించుకొని అధిక దిగుబడులు సాధించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జేసీ ఆధ్వర్యంలో కిసాన్ డ్రోన్‌లకు ఎంపిక కాబడిన రైతు సంఘాల కన్వీనర్లు, కో–కన్వీనర్లు, వ్యవసాయ సంచాలకులు, డ్రోన్ కంపెనీ ప్రతినిధులు, బ్యాంకు అధికారులకు జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. వారిని ఉద్దేశించి జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం 80శాతం సబ్సిడీతో అందజేస్తున్న డ్రోన్ టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకు ఖాతా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. డివిజన్, మండల స్థాయి అధికారులు రైతు సంఘాలకు తగిన సూచనలు ఇచ్చి సహాయపడాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి మాట్లాడుతూ ఐదు నుంచి ఆరుగురు రైతులు ఒక సంఘంగా ఏర్పడి 80 శాతం సబ్సిడీతో అందజేసే కిసాన్ డ్రోన్‌కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో రెండు కంపెనీలైన డ్రాకో డ్రోన్ టెక్నాలజీ లిమిటెడ్ వారు రూ.9.80ల



మాట్లాడుతున్న జేసీ సూరజ్ ధనుంజయ

క్షలు, విహంగా టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్ రూ.9.81లక్షలకు డ్రోన్‌లు అందుబాటులో ఉంచారని, వాటిలో ఏదో ఒకటి రైతులు తమకు ఇష్టమైన కంపెనీని ఎంచుకొని దరఖాస్తు చేసుకోవాలన్నారు. తొలుత బ్యాంకు నుంచి 50శాతం రుణం లభిస్తుందని, అనంతరం డ్రోన్ కంపెనీ నుంచి మంజూరైన తర్వాత వ్యవసాయశాఖ ద్వారా రూ.7.84లక్షలు (80శాతం) సబ్సిడీ రైతు సంఘాల ఖాతాలకు జమచేయబడుతుందన్నారు. జిల్లాలో మండలానికి మూడు చొప్పున 84సంఘాలు లక్ష్యంగా అందజేయాలని మండల అధికారులకు నిర్దేశించామని చెప్పారు. తొలుత మొదటి దఫాగా 43 సంఘాలకు సబ్సిడీతో డ్రోన్‌లు అందజేస్తామన్నారు. ఈసందర్భంగా డ్రోన్ ద్వారా అందజేసే పరికరాలను గురించి కంపెనీ ప్రతినిధులు వివరించారు. యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా బిజినెస్ మేనేజర్ జె.సుమన్, సహాయ వ్యవసాయాధికారి సీహెచ్ రవికుమార్, వ్యవసాయాధికారులు ప్రవీణ్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 4న శ్రీవాసవీ దేవస్థానం కమిటీ సర్వసభ్య సమావేశం

**తెనాలి:** శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం సత్రం కమిటీ సర్వసభ్య సమావేశం మే నెల 4వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు పాలకవర్గ బాధ్యులు మంగళవారం దేవస్థానం ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో తెలిపారు. కమిటీ ఉపాధ్యక్షుడు ఆకి అచ్యుతరావు, వుప్పల వరదరాజులు, దేసు శ్రీనివాసరావులు మాట్లాడారు. ముందుగా ఏప్రిల్ 13వ తేదీన సర్వసభ్య సమావేశం జరిపేందుకు నిర్ణయించి, ఆ ప్రకారం వెయ్యిమంది సభ్యులకు నోటీసులు పంపినట్టు గుర్తుచేశారు. దేవస్థానం కమిటీ జనరల్ బాడీలో సభ్యులు కాని వారు, అన్య కులస్తులు వచ్చి గందరగోళ పరిస్థితులు సృష్టించిన కారణంగా సమావేశాన్ని వాయిదా వేసినట్టు తెలిపారు. మళ్లీ సర్వసభ్య సమావేశం జరపాలంటే కార్యవర్గం సమావేశమై, తేదీని నిర్ణయించి వెయ్యిమంది సభ్యులకు నోటీసుల ద్వారా తెలియపరచాల్సి ఉందన్నారు. నిర్ణయించిన తేదీన సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి, అక్కడ తీసుకునే నిర్ణయం అమలవుతుందని చెప్పారు. ఎవరుపడితే వాళ్లొచ్చి, ఏవేవో పుస్తకాలు పెట్టుకుని సభ్యులు కానివారితో సహా సంతకాలు పెట్టించుకుని తామే కమిటీగా ఎన్నికయ్యాం అంటే చెల్లుబాటు కాదన్నారు. ఈ నెల 13న రసాభాసతో సమావేశం వాయిదా పడిన తర్వాత ట్రైనీ అడిషనల్ ఎస్పీ సుప్రజ వచ్చి బైలా తీసుకెళ్లినట్టు గుర్తుచే



సమావేశంలో కమిటీ నేతలు

శారు. 15 రోజుల సమయం తీసుకుని సమావేశం జరుపుదామని చెప్పినట్టే, వైశ్య కులదేవత శ్రీవాసవీ అమ్మవారి సాక్షిగా మే నెల 4వ తేదీన సర్వసభ్య సమావేశం జరుగుతుందని తెలిపారు. సభ్యులంతా హాజరై తగిన నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నామని చెప్పారు. అంతా ఆ నిర్ణయానికే కట్టుబడి ఉండాలన్నారు. సభ్యులకు నోటీసులు పంపుతున్నామని, ఆధార్ కార్డు, సమావేశం నోటీసు, ఐడీ కార్డు సహా సభ్యులు సమావేశానికి హాజరుకావాలని సూచించారు. పోలీసు బందోబస్తుతో సభ్యులనే లోనికి అనుమతిస్తారని తెలిపారు. వక్కలగడ్డ గంగాధర్, అన్నవరపు నరసింహారావు, గ్రంధి విశ్వేశ్వరరావు, మాలేపాటి హరిప్రసాద్, మద్దాళి శేషాచలం, గొడవర్తి సాయి హరేరామ్, సుగ్గుల మల్లికార్జునరావు, నూకల భాస్కరరావు, కొల్లా గురునాథ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల కేటాయింపుల్లో అసమానతలు సరిదిద్దాలి

**గుంటూరు ఎడ్యుకేషన్:** పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల కేటాయింపుల్లో నెలకొన్న అసమానతలను సరిదిద్దాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ బదిలీల చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చట్టంలో పొందుపర్చిన అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలను నాలుగు రకాలుగా విభజించిన ప్రభుత్వం, విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తిని వేర్వేరుగా నిర్ణయించడం తగదన్నారు. ఫౌండేషన్ స్కూల్లో 30 మంది పిల్లలకు ఒక ఉపాధ్యాయుడు, మోడల్ ప్రైమరీ స్కూల్లో 20 మంది పిల్లలకు ఒకరు, హై స్కూల్ ప్రైమరీలో 10 మంది పిల్లలకు ఒక్కరు చొప్పున కేటాయించడం ఏంటని ప్రశ్నించారు. అన్ని పాఠశాలల్లో కేటాయింపులు ఒకే విధంగా ఉండాలని అందరికీ ఒకే రకమైన నాణ్యమైన విద్య అందాలని డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమకుమారి మాట్లాడుతూ యూపీ పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను కేటాయించాలని అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ప్రతి మోడల్ ప్రాథమిక పాఠశాలకు ఐదుగురు ఉపాధ్యాయులను తప్పనిసరిగా కేటాయించాలని అన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల లభ్యతను బట్టి విద్యా విధానాన్ని మార్పులు చేయటం తగదన్నారు. దీనికి బదులుగా ఒక ఉన్నతమైన విద్యా విధానాన్ని రూపొందించి, దానికి తగ్గట్టు ఉపాధ్యాయులను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. అవగాహన సదస్సులో జిల్లా గౌరవ అధ్యక్షుడు పీవీ శ్రీనివాసరావు, జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, వై.నాగమణి, జిల్లా కోశాధికారి ఎండీ దౌలా, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, కె.సాంబశివరావు, ఎం. గోవిందు, ఎండీ షకీలా బేగం, కె.రంగారావు, బి.ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నక్కా వెంకటేశ్వర్లు